క్లుప్తంగా

ఆధారాలతో ఫిర్యాదు చేయండి

తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి



రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహసీల్దార్

మోమిన్‌పేట: భూ సమస్యలు ఉన్నవారు సంబంధిత పత్రాలతో ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి సూచించారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. సమస్యలు చెప్పే ముందు పూర్తి అవగాహనతో ఉండాలని చెప్పారు. ఫిర్యాదులో పేర్కొన్న విధంగా మీ సేవలో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. ధరణి సమస్యలను మీ సేవలో దరఖాస్తు చేసి, తగిన ఆధారాలను తహసీల్ కార్యాలయంలో సమర్పించాలని స్పష్టం చేశారు.

రోడ్డును బాగు చేయండి

పూడూరు: అంగడిచిట్టంపల్లి నుంచి లాల్ పహాడ్ వరకు గుంతలమయమైన ఆర్‌అండ్‌బీ రోడ్డును మరమ్మతు చేయించాలని పలు గ్రామాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పరిగి ఆర్‌అండ్‌బీ అధికారి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. రహదారి సక్రమంగా లేక పోవడం వలన ఆర్టీసీ సంస్థ బస్సులను ఈ మార్గంలో తిప్పడం లేదని తెలిపారు. ప్రైవేటు వాహనాలూ తిరగడం లేదని పేర్కొన్నారు. చన్గోముల్ నుంచి కంకల్ వరకు రోడ్డును తవ్వి వదిలేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వెల్లడించారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డును బాగు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రవీందర్, రాజు, శేఖర్, శ్రీనివాస్, సుధాకర్ ఉన్నారు.

మద్యం అక్రమ అమ్మకాలను అరికట్టండి



ఎక్సైజ్ సీఐ వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఐఎం నాయకులు

కొడంగల్ రూరల్: అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని ఎంఐఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎక్సైజ్ సీఐ వెంకటేశ్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం తాలూకా అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ మాట్లాడారు. యువత మద్యానికి బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టి, వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో షేక్ రోమన్, ఎండీ.సర్దజ్ హుస్సేన్, ఎండీ.శన్వాజ్ హుస్సేన్, సయ్యద్ బాబా, ఎండీ.ఇబ్రహీం, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో టీబీ హెల్త్ క్యాంపు

కుల్కచర్ల: క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించే ప్రక్రియలో భాగంగా సోమవారం చౌడాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో టీబీ ఐడెంటిఫికేషన్ హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నవాబుపేట్ వైద్యాధికారి నరేష్ చంద్ర, మెడికల్ అసిస్టెంట్ శరభలింగం మాట్లాడారు. నిరంతరాయంగా పొడి దగ్గుతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆయాసం, త్వరగా నీరసించడం వంటివి ఉంటే.. టీబీ లక్షణాలుగా పేర్కొనవచ్చని, ఇలాంటి వాటితో బాధపడుతున్న వారు ఎవరైనా ఉంటే.. మండల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వినోద్, రాజు, కమలమ్మ, అంజమ్మ, నూర్జహాన్, పార్వతమ్మ, నర్సింగమ్మ, రాజేశ్వరి, ప్రమీల, నిర్మల, అంజమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

యాలాల: కురుస్తున్న వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. వరుస వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచిస్తుందని పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గత నెలలో పిడుగుపాటుకు మండలంలో ముగ్గురు రైతులు, మూగజీవాలు మృత్యువాతపడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వ్యవసాయ పనుల సమయంలో ఉరుములు, మెరుపులు ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు చెట్ల కిందకు వెళ్లరాదని సూచించారు. ఉరుములు, మెరుపుల వచ్చినప్పుడు ఫోన్ వినియోగించకూడదని చెప్పారు. ఏదైనా ఆపద కలిగితే.. వెంటనే డయల్ 100 లేదా స్థానిక రెవెన్యూ అధికారులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

సాగుపై అవగాహన నేడు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎల్ఎన్ గార్డెన్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల సాగుకు సమాయత్తంపై మంగళవారం ఉదయం 9 గంటలకు ఫర్టిలైజర్ దుకాణదారులు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏఓ నిషాంత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య
- ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం
- సర్కారు సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి
- మీ పిల్లల బంగారు భవిష్యత్‌కు పునాది వేయండి
- బడిబాటలో ఉపాధ్యాయులు



కుల్కచర్ల: చౌడాపూర్ బడిబాటలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, ఉపాధ్యాయులు

బంట్వారం: చదువుతోనే సమాజంలో సముచిత గౌరవం లభిస్తుందని కోట్‌పల్లి మండలం బార్వాద్ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సీహెచ్ వెంకటరత్నం అన్నారు. బడిబాటలో భాగంగా సోమవారం ఆయన ఉపాధ్యాయులతో కలిసి బార్వాద్, మద్గుల్ తండాలో ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రైవేటు బడులకు పంపించకుండా సర్కారు పాఠశాలల్లోనే మీ చిన్నారులను చదివించాలని కోరారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ ఉచితంగా ఇస్తున్నామని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, రాంచంద్రయ్య, ఫరూక్, విజయ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు ఎంపిక

కొడంగల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో కొనసాగుతున్న విద్యాభ్యాసంతో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని హెచ్ఎం క్రాంతికుమార్ తెలిపారు. మండల పరిధి పాఠశాలల్లో బడిబాటను నిర్వహించారు. మున్సిపల్ పరిధి పాత కొడంగల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ సర్కారు బడిలో చిన్నారులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. గత ఏడాది తమ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు గురుకులాలకు ఎంపికయ్యారని, ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులు తదితర వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శారద, ఆశ కార్యకర్త రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా..

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రభుత్వ బడులను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ రాందాస్ నాయక్ కోరారు. చౌడాపూర్‌లో నిర్వహించిన బడిబాటలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్‌కు దీటుగా మౌలిక సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని తెలిపారు. మీ పిల్లలను సర్కారు బడికి పంపి, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. ఇందులో జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్యానాయక్, సీనియర్ అసిస్టెంట్ లింగయ్య తదితరులు ఉన్నారు.



బంట్వారం: బడిబాట ర్యాలీలో హెచ్ఎం వెంకటరత్నం తదితరులు

బడీడు పిల్లలను బడిలో చేర్పించండి

దౌల్తాబాద్: బడీడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని గోకఫసల్‌వాద్ పాఠశాల హెచ్ఎం సాయిలు కోరారు. మండల పరిధి గోకఫసల్‌వాద్ గ్రామంలో ఆయన తోటి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులతో కలిసి బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున్ ఉన్నారు.

ఎమ్మార్సీకి పాఠ్యపుస్తకాలు

యాలాల: 2024–25 విద్యా సంవత్సరానికి అవసరమైన పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీకి చేరుకున్నాయి. సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా అవుతున్నాయి. మండలంలో 10 ఉన్నత పాఠశాలలు, 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా.. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 29,900 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎమ్మార్సీ సిబ్బంది తెలిపారు. పాఠ్యపుస్తకాలతో పాటు 29,900 నోటు బుక్కులు, 1 నుంచి 5వ తరగతి వరకు వర్కు బుక్కులు వచ్చినట్లు వెల్లడించారు. 99 శాతం పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీకి వచ్చాయన్నారు. ఉపాధ్యాయులు వారి పాఠశాలలకు కావాల్సిన పుస్తకాలను తీసుకెళ్తున్నట్లు స్పష్టంచేశారు.

పుస్తకాల పంపిణీ

కుల్కచర్ల: చౌడాపూర్ మండల కేంద్రంలోని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఆర్పీలు విజయ్‌కుమార్, రాఘవేందర్‌లు మాట్లాడారు. మండల పరిధి 46 బడులకు సరిపడా బుక్స్ సరఫరా అయ్యాయని వెల్లడించారు.



యాలాల: పాఠశాలలకు బుక్స్ తరలింపు

బంగారు భవిష్యత్‌కు బాట

పెద్దేముల్: బడిబయట పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మణి కోరారు. మండల పరిధి కందనెల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లారు. బడిబయట పిల్లలు, ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల వివరాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలతో పాటు.. నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని, మీ పిల్లలను సర్కారు బడికి పంపించి, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. ఐదు సంవత్సరాలు దాటిన ఇద్దరు చిన్నారులను బడిలో చేర్పిస్తున్నట్లు హెచ్ఎం వెల్లడించారు. ఇందులో జీపీ కారద్యర్శి రమేష్, ఉపాధ్యాయులు భారతి, ప్రమోద్, సరోజ, ఎస్ఎంసీ చైర్మన్, అంగన్‌వాడీ టీచర్‌లు తదితరులు పాల్గొన్నారు.



కందనెల్లి గ్రామంలో బడిబాట..

ఆంగ్ల మాధ్యమంలో..

దోమ: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్, ఎంపీడీఓ మహేశ్‌బాబు అన్నారు. మండల పరిధి బాస్‌పల్లి, బొంపల్లి గ్రామాల్లో నిర్వహించిన బడిబాటలో వారు ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థుల వివరాలను సేకరించారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్యతో పాటు.. ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, భోజనం అందజేస్తున్నట్లు వెల్లడించారు. మీమీ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా.. సర్కారు బడికి పంపి.. ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్, బాస్‌పల్లి ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని, బొంపల్లి ప్రధానోపాధ్యాయులు షఫి, ఉపాధ్యాయులు రాధిక, నీల్‌సింగ్, వెంకటయ్య, శివశంకర్, జీపీ కార్యదర్శులు చంద్రకాంత్, హాలీం ఉన్నారు.



బొంపల్లిలో..

పంపిణీకి యూనిఫామ్స్ సిద్ధం

పాఠశాలల సిబ్బందికి అందజేస్తున్న ఐకేపీ

మోమిన్‌పేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసే ఏకరూప దుస్తులు సిద్ధంగా ఉన్నాయని ఏపీఎం రాజు తెలిపారు. రెండు నెలల క్రితం యూనిఫామ్స్ కుట్టేందుకు మహిళా సమాఖ్యలకు ప్రభుత్వం వస్త్రాన్ని అందజేసిందని తెలిపారు. ఇందుకు కుట్టు కూలిగా ఒక్కో జతకు ప్రభుత్వం రూ.75 చెల్లించిందని చెప్పారు. తద్వారా డ్వాక్రా మహిళలకు ఉపాధి లభించిందన్నారు. సుమారు 3,138 జతలు సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. వీటిని మండల విద్యాధికారికి అందజేస్తామన్నారు. పాఠశాలలు ప్రారంభం అయిన వెంటనే విద్యార్థులకు ఉచితంగా దుస్తులను పంపిణీ చేయనున్నట్లు ఏపీఎం స్పష్టం చేశారు.

పాఠశాలకు సరఫరా

తాండూరు రూరల్: మండల పరిధి కోట్లాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు ఐకేపీ సిబ్బంది యూనిఫాంలను అందజేశారు. విద్యార్థుల యూనిఫాం కుట్టేందుకు మహిళా సంఘాలకు ప్రభుత్వం వస్త్రాన్ని అందజేయగా.. కుట్టిన జతలను ఐకేపీ ఏపీఎం ఆనంద్ కుమార్, సీసీ శంకర్‌లు సోమవారం హెచ్ఎం సువర్ణకు 88 జతలను అందజేశారు. అనంతరం ఏపీఎం మాట్లాడారు. ఒక్కో జత ఏక రూప దుస్తులు కుట్టినందుకు గాను ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.75 చెల్లించిందని తెలిపారు. ఇందులో గ్రామ సంఘం అధ్యక్షురాలు రేణుక, వీఓఏ భాగ్యలక్ష్మి ఉన్నారు.



మోమిన్‌పేట: మహిళా సమాఖ్య కార్యాలయంలో దుస్తులను లెక్కిస్తున్న ఏపీఎం రాజు

హరితహారానికి ఏర్పాట్లు చేయండి



మొక్కలు నాటేందుకు గుంతలను తవ్వుతున్న ఉపాధి కూలీలు. పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఎంపీడీఓ రామకృష్ణ

కుల్కచర్ల: హరితహారం కార్యక్రమం చేపట్టేందుకు ఏర్పాట్లను సిద్ధం చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధి బిండెంగడ్డతండా, చింతల్‌కుంటతండాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా ప్రతీ గ్రామంలో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. అదే విధంగా మిషన్ భగీరథ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని, అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో కొనసాగుతున్న మౌలిక వసుతల కల్పనను పూర్తి చేయాలని సూచించారు. బిండెంగడ్డతండా గ్రామపంచాయతీ కార్యదర్శి సునిత, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



దుద్యాల్: లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కడా అధికారి

దుద్యాల్: పార్లమెంటు ఎన్నికల కోడ్ కారణంగా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి స్వల్ప అంతరాయం కలిగిందని కడా అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండల కేంద్రంతో పాటు హకీంపేట్, పోలేపల్లి తదితర గ్రామాలకు చెందిన 47మంది లబ్ధిదారులకు పెండింగులో ఉన్న కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శేఖర్, మేరుగు వెంకటయ్య, నర్సింహ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు తాండూరులో..

తాండూరు టౌన్: క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మంగళవారం ఉదయం 10.30 గంటలకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరు, పెద్దేముల్ మండలాలకు చెందిన 237 మంది లబ్ధిదారులకు రూ.2.37కోట్ల విలువగల చెక్కులను ఎమ్మెల్యే అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

'జీరో' బిల్లును వినియోగించుకోండి

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిధి అంతారం గ్రామంలో పలువురు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులను ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడారు. పథకం కింద 200ల యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకున్న వారికి జీరో బిల్లు వస్తుందని తెలిపారు. ఇందులో లైన్‌మెన్ అక్తర్, పీఏసీఎస్ డైరెక్టర్ పెండ్యా నర్సింలు, రాజు పటేల్, నక్కల పుల్లప్ప,పెండ్యా ప్రకాష్, శేఖర్, అనంతయ్య ఉన్నారు.

గుర్తింపు ఉన్న బడుల్లో చేర్పించండి

కొందుర్గు: ప్రభుత్వ గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఎంఈఓ కిష్టారెడ్డి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలలు నడిపిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభమవుతాయని, బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు.

అడవిలో చెట్ల నరికివేత

ధారూరు: ఫారెస్టు రేంజ్ పరిధి దోర్నాల్ బీట్‌లో అక్రమార్కులు చెట్లను నరికి వేశారు. శని, ఆదివారాలు సెలవు దినం కావడంతో.. సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. ధారూరు దోర్నాల్ బీట్‌లో కొందరు చెట్లను నరికివేస్తూ.. పొలాలను చదును చేసుకునేందుకు యత్నిస్తున్నారు. వర్షాలు పడితే సాగు చేసి అటవి భూమిని ఆక్రమించుకోవాలనే ఎత్తుగడగా కనిపిస్తోంది. చెట్లు నరికిన ప్రాంతాన్ని సోమవారం ఇన్‌చార్జి ఫారెస్టు రేంజర్ అరుణ పరిశీలించి వెళ్లిపోయారు. కానీ.. ఎలాంటి చర్యలకు ఆదేశాలు ఇవ్వనట్లు సమాచారం. గతంలో సంగాయ్‌పల్లి అడవిలో చెట్ల నరికివేతపై ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ, విజిలెన్స్ డీఎఫ్ఓ విచారణ జరిపించారు. కానీ.. ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇలా వరుసగా చెట్లు నరికి వేస్తున్నప్పటికీ.. నరికిన వారిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులు ముందుకు రాకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అక్రమార్కులతో అధికారులు చేతులు కలిపారనే ఆరోపణలు వినవస్తున్నాయి. వారి నిర్లక్ష్యం కారణంగానే అడవి కుంచించుకు పోతుందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అటవీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, చెట్లను నరికివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



దోర్నాల్ అడవిలో చెట్లను నరికివేసిన ప్రదేశం

రైతు సమస్యలపై నిర్లక్ష్యం సరికాదు

చేవెళ్ల: రైతు సమస్యలపై ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సామ మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సోమవారం పశువైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో పశువులు మృతి చెందుతున్నాయని సంఘ్ సభ్యులు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. పశువైద్యం సకాలంలో అందక గుండాల గ్రామానికి చెందిన రైతు శ్రీరాంరెడ్డి పాడి ఆవు మృతి చెందిందని ఆరోపించారు. గ్రామాల్లో పశువైద్య సిబ్బంది నిర్లక్ష్యమే దీనికి కారణమని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరగకుండా చూడాలని కోరారు. పొలాల వద్ద రైతులకు విద్యుత్ సమస్యలు అనేకం ఉన్నాయని, విద్యుత్ అధికారులు స్పందించి వాటిని పరిష్కరించాలని కోరారు.

భగీరథ నల్లాల లెక్క పక్కా



దౌల్తాబాద్: సర్వే చేస్తున్న జీపీ కార్యదర్శి గోపాల్



తాండూరు రూరల్‌లో..

- గ్రామాల్లో కొనసాగుతున్న ఇంటింటి సర్వే
- ప్రత్యేక యాప్‌లో వివరాలు నిక్షిప్తం

దౌల్తాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా తీరుతెన్నులపై ప్రభుత్వం ప్రత్యేక సర్వే చేపట్టింది. ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్, తాగునీటి సరఫరా తదితర వివరాలను సేకరించే బాధ్యతను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించింది. ఇందులో భాగంగా రెండు రోజులుగా గ్రామాల్లో జీపీ కార్యదర్శులు, పెద్ద పంచాయతీల్లో కార్యదర్శులతో పాటు అంగన్‌వాడీ, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సర్వే చేస్తున్నారు. సోమవారం దౌల్తాబాద్‌లో పంచాయతీ కార్యదర్శి గోపాల్ ఇంటింటికీ తిరిగారు. భగీరథ నీరు సక్రమంగా సరఫరా అవుతున్నాయా.. లేవా, నీరు సరిపోతున్నాయా తదితర వివరాలను సేకరించారు. వాటితో పాటు గ్రామంలో ఎన్ని గృహాలు ఉన్నాయి. అందులో ఎన్ని నివాసాలకు భగీరథ నల్లా కనెక్షన్లు ఇచ్చారు, ఇంకా ఏమైనా కొత్త కనెక్షన్లు అవసరమా? ఉన్న వాటికి నీరు సరఫరా అవుతుందా అనే తదితర వివరాలతో పాటు, కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

భగీరథ నీరు తాగండి

తాండూరు రూరల్: ప్రజలు మిషన్ భగీరథ నీరు తాగాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ కోరారు. సోమవారం మండల పరిధి గోనూర్ గ్రామంలో ఆయన ఇంటింటికీ తిరిగారు. భగీరథ నీరు సక్రమంగా సరఫరాపై అవుతున్నాయా లేవా అని ఆరాతీశారు. అనంతరం జీపీ కార్యదర్శితో మాట్లాడారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి భగిరథ నీరు వస్తున్నాయా లేదా అనే విషయాలపై ఎప్పటికప్పుడు సర్వే చేయాలని సూచించారు. భగీరథ నీటిని ఒక్కో ఇంటికి 100 లీటర్ల చొప్పున సరఫరా చేయాలని ఆదేశించారు. భగీరథ నీరు వాడుతున్నారా లేదా? వాడక పోతే ఎందుకు వాడటం లేదు అనే విషయాలను సేకరించాలని, దాంతో పాటే నల్లా కనెక్షన్ ఉన్న ఇంటి యజమాని ఫొటో తీసుకోవాలని చెప్పారు. అనంతరం కలెక్టర్‌కు పూర్తి నివేదికను పంపిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీఓ నరోత్తంరెడ్డి, ఈసీ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

వారం రోజుల్లో పూర్తి కావాలి

పెద్దేముల్: మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్లపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే వారం రోజుల్లో పూర్తి చేయాలని మండల ఇన్‌చార్జి ఎంపీఓ రమేష్ ఆదేశించారు. మండల పరిధి కందనెల్లి, మంబాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం రమేష్ మాట్లాడారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో మొత్తం 13,721 భగీరథ కనెక్షన్‌లు ఉన్నాయని తెలిపారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నుంచి వారం రోజుల పాటు పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బందితో సర్వే చేయించనున్నట్లు వెల్లడించారు. సర్వేలో 500 ఇండ్లకు ఎక్కువగా ఉన్న గ్రామాలకు ఐకేపీ సిబ్బందిని నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ భగీరథ కనెక్షన్ ఉందా? లేదా? ఉంటే నిత్యం నీరు వస్తుందా.. తదితర వివరాలను సేకరించి, భగీరథ సర్వేయాప్‌లో నమోదు చేయనున్నట్లు రమేశ్ తెలిపారు. సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కందనెల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీఓ రమేష్

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్: కలెక్టర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. కంటి సమస్యలు ఉన్నవారు ఆధార్‌కార్డుతో వచ్చి.. పరీక్ష చేయించుకోవాలని సూచించారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు వెల్లడించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

యాలాల: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పుష్పలీల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా అధ్యక్షతన మండల పరిషత్ సమావేశపు హాలులో ఉదయం 11 గంటలకు సమీక్ష జరగనుందని వెల్లడించారు.

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

కొడంగల్ రూరల్: సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు చాలా అవసరమని, ఉన్నత చదువుల్లో అది ఎంతగానో ఉపయోగపడుతుందని అనూష్ కంప్యూటర్స్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు పద్మనాభరెడ్డి అన్నారు. పట్టణంలోని ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన వేసవి శిక్షణలో ఉచితంగా 45 రోజుల పాటు డీసీఏ, డీటీపీ, డీసీఏపీ, ఎంఎస్-ఆఫీస్, ఫొటోషాప్ తదితర కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చామని నిర్వాహకులు తెలిపారు. ఈ క్రమంలో సోమవారం నిర్వహించిన పరీక్షలో శిక్షణ పొందిన వారిలో 280 మంది హాజరయినట్లు తెలిపారు.

పనులు పూర్తి చేయండి

తాండూరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న అన్నారు. సోమవారం ఆమె మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డితో కలిసి పట్టణంలోని మల్‌రెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాఘవేంద్రకాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల కల్పనను త్వరగా పూర్తి చేయాలని నిర్వాహకులకు చెప్పారు.